కర్నూలు | నంద్యాల
వార్త
21 ఆగస్టు , 2023 సోమవారం పేజీలు 4

# మొదటి సంవత్సరం అభ్యసించే ఎంబిబిఎస్ విద్యార్థులకు ల్యాబ్‌లలో అన్ని ఏర్పాట్లు చేయండి

- నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాలను అకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టరు

**నంద్యాల, ఆగష్టు 20, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలో నూతనంగా నిర్మితమైన మెడికల్ కళాశాలలో విద్యను అభ్యసించే మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కోర్స్‌కు అవసరమయ్యే అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ ఎపీఎంఎస్‌ఐడిసిని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌లను అదేశించారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లో నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాల భవనాలను కలెక్టరు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో సెప్టెంబర్ 1 నుండి మొదటి సంవత్సరం విద్యనభ్యసించే ఎంబిబిఎస్ విద్యార్థులకు అనాటమి, బయో కెమిస్ట్రీ,ఫిజియాలజీ ల్యాబ్‌లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఏపీఎంఎస్‌ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంబంధిత కాంట్రాక్టర్‌ను అదేశించారు. మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థుల అడ్మిషన్స్ పూర్తి అయ్యాయని వచ్చేనెల 1 నుండి క్లాసులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మెడికల్ కళాశాలలో అరకొరగా మిగిలి ఉన్న పనులను ఈనెల 31లోగా యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టరు అదేశించారు.



## పల్లకి ఊరేగింపు

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు
- ఈఓ పర్యవేక్షణలో పల్లకి ఊరేగింపు

**కౌతాళం, ఆగస్టు20,ప్రభాతవార్త ;** ఉరుకుంద ఈరన్నస్వామి వారి దేవస్థానంలో స్వామివారి మకర తోరణలకు 3 బంగారు కలశములు, స్వామివారి పల్లకిని 25 కేజీల వెండితో కవచము తొడుగు ఏర్పాటుకు మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సతీమణి జయమ్మ దాతృత్వంచే శ్రావణమాస శుద్ధ చవితి ఆదివారం ఉదయం 9;30 గంటల నుంచి దేవస్థాన ఆర్చిగేటు దగ్గర నుంచి ఊరేగింపు చేపట్టారు. సాయంత్రం 3;15 గంటల నుంచి బంగారు కలశాలు, స్వామివారి వెండి పల్లకి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నిజ శ్రావణ శుద్ధ పంచమి తెల్లవారుజామున బ్రాహ్మీ ముహూర్త కాలంలో కర్కాటక లగ్నశుభ పుష్కరాంశంలో 4;20 గంటలకు దేవస్థాన పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు వారి అర్చక సిబ్బంది మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి మకర తోరణంపైన 3 బంగారు కలశాలు స్థాపన చేసి ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వాణి, ఆలయ చైర్మన్ నాగరాజుగౌడ్, మండల నాయకులు దేశాయి ప్రహ్లాద ఆచారి తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# ఉగ్రవాద కదలికలు.. ఉన్నాయా...!?

: కొనసాగుతున్న ఎన్ఐఏ విచారణలు
: జిల్లా పోలీసు లకు సమాచారం లేదా..?




**ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉగ్రవాద కదలికలు ఉన్నాయా..? అనే విషయం హాట్ టాపిక్‌గా మారింది. ఈనెల రెండవ వారంలో ఎన్ఐఏ అధికారులు అకస్మాత్తుగా నగరానికి చెందిన ఇద్దరని అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలతో ఆపేశారు.. వెళ్లిపోయారు అనుకుంటున్నారు. కాని కొందరు ఎన్ఐఏ అధికారులు ఇంకా నగరంలో కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. అంటే ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించి మరింత లోతుగా నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ విచారణలు చేస్తుందని అర్థమవుతుంది. వారి విచారణల విషయం జిల్లా పోలీసులకు ఏమాత్రం సమాచారం లేదని అర్థమవుతుంది. అది అలా ఉంచితే అసలు ఈ విషయాలపై జిల్లా పోలీసులకు తాజా సమాచారం ఏమైనా ఉందా.. ఉంటే జాగ్రత్త చర్యలు తీసుకోవాలి కదా.. అనే చర్చ జరుగుతోంది. పోలీస్ స్టేషన్‌లో పనిచేసే మఫ్టీ పార్టీ నుంచి డిఎస్పి టీం, స్పెషల్ బ్రాంచ్ వన్ అండ్ టూ, ఎస్పీ పార్టీ ఇలా ఎన్నో భాగాల్లో కేవలం నిఘా కోసం చాలామంది పోలీసులు పని చేస్తున్నారు. వారందరికి తాజా సమాచారంపై అప్‌డేట్ లేనట్లు ఉంది. అలాగని జిల్లాలో అలాంటి కార్యక్రమాలు లేవా అంటే మరి ఎన్ఐఏ వారు ఎందుకు ఇక్కడే మఖాం వేశారు అన్న ప్రశ్న విన్పిసుంది. అదే క్రమంలో జిల్లా పోలీసులు ఏం చేస్తున్నారు అన్న ప్రశ్న కూడా అదే స్థాయిలో వినిపిస్తుంది. ఏది ఏమైనా జిల్లాలో ఉగ్రవాద కదలికలు ఉన్నాయి అనడంలో సందేహం లేదని గత సంవత్సరం ఒక ఎస్పీ ఇచ్చిన నివేదికలో స్పష్టం అయ్యింది. .**

*కర్నూలు, ప్రభాతవార్త :*




గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సంస్థ బాగా యాక్టివ్‌గా పని చేసిందని పోలీసులు అనుమానించారు. తాజాగా ఆ సంస్థ కార్యకలాపాలకు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో లింకులు దొరికాయని సమాచారం. తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్‌కు చెందిన తబరేజ్ అనే వ్యక్తికి నిషేధిత పిఎఫ్ఐ సంస్థతో సంబంధాలు కలిగి ఉన్నట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఆ వ్యక్తి దుబాయ్‌లో ఉంటున్నాడు. అక్కడి నుండి పలు రాష్ట్రాల్లో కొందరితో ఆయన సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఆ సమాచారం మేరకు కర్నూలు నగరంలో ఉంటున్న ఇద్దరు వ్యక్తులను గత నెల 10వ తేదీన విచారించారు. వారి నుంచి సేకరించిన సమాచారంతో అధికారులు సంతృప్తి చెందనప్పటికి వారిని అరెస్ట్ చేయకుండా వదిలేశారు. కాని సర్వేలెన్స్ మాత్రం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఆ కేసుకు సంబంధించి ఇతర కోణాలలో విచారణలు సాగుతున్నాయని సమాచారం. ఇందులో మరికొన్ని కొత్త విషయాలు బయటకు రావచ్చన్న అనుమానాలు ఉన్నాయి. ఇది ఇలా ఉండగా ఎన్ఐఏ విచారణ కానీ... నిషేధిత సంస్థ కార్యకలాపాలు గాని... ఇతర ఉగ్రవాద కదలికలు గాని స్థానిక పోలీసులకు తెలియదా.. అనే విషయంలో స్పష్టత లేదు.

● వివరాలు 2లో

## భక్తిశ్రద్ధలతో.. నాగులచవితి వేడుకలు

- పుట్టల్లో పాలుపోసేందుకు బారులు తీరిన మహిళలు

**బనగానపల్లె ,ఆగస్టు20,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణం,మండలంలోని ఆయా గ్రామాల్లో వెలసిన నాగుల కట్టలకు,పుట్టలకు ఆదివారం నాగులచవితి సందర్భంగా భక్తులు,అర్చకులు స్వామివారికి అభిషేకాలు,విశేష పూజలు నిర్వహించారు.పుట్టలకు పాలుపోసి నూలుదారం కుట్టి స్వామివారికి ముడుపులు చెల్లించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు .పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయం, జీఎం టాకీస్ వద్ద,వెంకటేశ్వరస్వామి ఆలయం,పలుకూరు శివాలయం, టంగుటూరు, పసుపల,కొత్తపేట, జోలాపురం, పాతపాడు, ఎర్రగుడి,యనకండ్ల తదితర గ్రామాల్లో ఉన్న నాగుల కట్ట,నాగులపుట్టల వద్దకు తెల్లవారుజామునే భక్తులు తలస్నానాలు ఆచరించి,నూతన వస్త్రాలు ధరించి అధిక సంఖ్యలో మహిళలు చేరుకుని అర్చకుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహింపజేసి పుట్టల్లో పాలుపోసి,చలిమిడిముద్ద,నూగుముద్ద నైవేద్యం చెల్లించి,చీరలు పెట్టి మొక్కులు చెల్లించి నాగులచవితిని భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు.అలాగే పట్టణంలోని,మండలంలోని ఆయా కాలనీల్లో,దేవాలయాల్లో ఉన్న నాగులకట్ట,పుట్టలకు పాలు పోసేందుకు మహిళలు బారులుతీరారు.





## బిజెపి జిల్లా అధ్యక్ష పదవికి.. 16 మంది పోటీ..!

- సీనియర్లు, జూనియర్ల మధ్య నలిగిపోతున్న బిజెపి పార్టీ
- కార్యకర్తలు పుష్కలం.. ఓటు బ్యాంకు పదిలం... సమన్వయ లోపం



**నంద్యాల విద్య, ఆగష్టు 20, ప్రభాతవార్త:** జిల్లాలో భారతీయ జనతా పార్టీకి అధికమైన ఓటు బ్యాంకు కలిగి ఉంది. కార్యకర్తల సంఖ్య అధికంగా ఉంది. అయినప్పటికి సమన్వయ లోపంతో బిజెపి పార్టీ పంజుకోకపోవడం విశేషం. సీనియర్లు, జూనియర్ల మధ్య బిజెపి పార్టీ నలిగిపోతున్న సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలిగా పురంధేశ్వరీ బాధ్యతలు చేపట్టినప్పటికి జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించలేదు. దీంతో బిజెపి కార్యకర్తల్లో ఆశావహులు ఎక్కువయ్యారు. నంద్యాల జిల్లా బిజెపి పార్టీ అధ్యక్ష పదవికి పోటా పోటీ నెలకొంది. సీనియర్లు, జూనియర్లతో పాటు 16 మంది ఈ పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో జనసేన, బిజెపి పార్టీ వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలన్న ఏకాభిప్రాయానికి వచ్చినప్పటికి క్రింది స్థాయిలో క్యాడర్ సమన్వయంతో పనిచేయలేదన్న అరోపణలు వినిపిస్తున్నాయి. నంద్యాల జిల్లాలో వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 10న కలెక్టరేట్ వద్ద బిజెపి అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో సమన్వయం లేక కొట్టుకొచ్చినట్లు కనిపించింది. కొంత మందిని పిలువకపోవడం, కీలకమైన పదవుల్లో వున్న వారిని దూరం పెట్టడం వంటి అరోపణలు వినిపించాయి. నంద్యాల పట్టణంలో పార్టీని ముందుకు తీసుకెళ్లందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నప్పటికి వారికి అడ్డుకట్టవేసే దిశగా కొంత మంది వ్యవహారిస్తున్నారన్న అరోపణలున్నాయి. గతంలో రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు నంద్యాల పట్టణానికి వచ్చినప్పుడు కూడ ఒకరిపై ఒకరు అరోపణలు చేసుకున్న సంఘటనలు జరిగాయన్న అరోపణలు వినిపించాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలు కానీవారిని కూడ బూత్ ఏజెంట్లుగా నియమించిన సంఘటనలు జరిగాయని పార్టీలోని వారే గుసగుసలాడుకోవడం విశేషం. బిజెపి రాష్ట్ర పదవుల్లో మార్పులు. జిల్లాల్లో మార్పుల కోసం అదిష్టానం కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. జిల్లాలో అధ్యక్ష పదవి కోసం డా.ఇంటి ఆదినారాయణ, మేడం మురళీధర్, నాగరాజు, శ్రీకాంత్‌రెడ్డి, నరసింగరావు, అభిరుచి మధుతో పాటు బిజెపి పట్టణ అధ్యక్షులు బ్రహ్మయ్యఅచారి, డోన్‌కు చెందిన హేమసుందర్ రెడ్డి, బనగానపల్లెకు చెందిన శివకృష్ణయదవ్, ఏకైక ఎంపిటిసి భగవాన్ యాదవ్‌తో పాటు మరి కొంతమంది పోటీలోఉన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేసేందుకు గ్రామీణ స్థాయి నుంచి క్యాడర్‌ను పెంపొందించుకునేందుకు పకడ్బంది ఏర్పాట్లుచేసేందుకు బిజెపి పార్టీ కసరత్తు ప్రారంభించింది. ఈదశలో అందరిని కలుపుకొని పార్టీని ముందుకు తీసుకెళ్లెందుకు మంచి వ్యక్తిని ఎంపిక చేసేందుకు అదిష్టానం కసరత్తు చేస్తోంది. ఈదశలో జిల్లా అధ్యక్ష పదవి ఏవరిని వరించేనో అని ఎదురు చుస్తున్నారు.

# రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా విజయం మాత్రం.. వైసిపిదే..!

- మంత్రి గుమ్మనూరు జయరాం

**ఆలూరు, ఆగస్టు 20,ప్రభాతవార్త** రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా విజయం మాత్రం..వైసిపిదేనని..రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆదివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆలూరు నియోజకవర్గ పరిధిలోని ఉప ఎన్నికల్లో వార్డుమెంబర్లుగా గెలిచిన సభ్యులను,కుటుంబ సభ్యులకు మంత్రి గుమ్మనూరు జయరాం శాలువా,పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ రానున్న 2024ఎన్నికల్లో చంద్రబాబుకు,పవన్‌కు రాష్ట్ర ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. కుప్పం నియోజకవర్గంలో 6వార్డుల్లో ఎన్నికలు జరిగితే 5మంది వైసిపి అభ్యర్థులే విజయం సాధించారన్నారు. మీ నియోజకవర్గంలో గెలవలేని మీకు సిగ్గుచేటు కాదా..అని ప్రశ్నించారు. తాజాగా నిన్న జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో జోరుగా ఫ్యాన్ హవా కొనసాగిందన్నారు. మొత్తం 66సర్పంచ్ పదవులకు గాను 53చోట్ల పార్టీ బలపరచిన వారే విజయం సాధించారన్నారు. 1062వార్డు సభ్యుల్లో 810మంది వైసిపి మద్దతుదారులే గెలుపొందారన్నారు. ఆలూరు నియోజకవర్గ పరిధిలోని 7వార్డుమెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనా 2చోట్ల పోటీ జరిగితే ఒకటి వైసిపి గెలిచిందన్నారు. సిఎం జగనన్న నాలుగేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ది,సంక్షేమ పథకాలే గెలుపుకు విజయబాటలు వేసిందని మంత్రి పేర్కొన్నారు. గ్రామంలో ప్రతికార్యకర్త సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు,జడ్‌పి వైస్ చైర్మన్ బావ శేషప్ప,ఎంపిపి తనయుడు ఈసా,చిప్పగిరి ఎంపిపి భర్త మారయ్య,హొలగుంద బోర్డు అడ్వైజరింగ్ చైర్మన్ మల్లికార్జున,యువ నాయకుడు ఎండి హళ్లి కురువ రంగస్వామి, తిక్కన్న,సులువాయి కన్నయ్య తదితరులున్నారు.



# ప్రభుత్వ బాలుర వసతి గృహం-2లో నీటికష్టాలు..!

- మంచినీరు తాగడానికి స్కూల్ గేటు దూకుతున్న హాస్టల్ విద్యార్థులు
- ప్రభుత్వ హాస్పిటల్‌కి వెళ్లి మంచినీరు తెచ్చుకుంటున్న విద్యార్థులు



**పత్తికొండ సాంఘీక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గృహంనంబర్-2లో గత మూడురోజులుగా తాగడానికి,వాడుకోవడానికి నీరు లేక హాస్టల్ విద్యార్థులు పడుతున్న భాద వర్ణణాతీతం. హాస్టల్‌లో బోరు కాలిపోవడంతో హాస్టల్ వార్డెన్ బోరు మరమత్తులు చేపట్టకపోవడంతో విద్యార్థులకు భోజన సమయంలో కూడా మంచినీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేయలేకపోతున్నారు. విద్యార్థులు చేసేదేమీ లేక హాస్టల్‌లో భోజనం చేసి ప్రభుత్వ హాస్పిటల్, జూనియర్ కాలేజీ, హైస్కూల్‌ల చుట్టూ ప్లేట్లతో తిరిగి ఎక్కడ మంచినీరు కనబడితే అక్కడ తమ ప్లేట్లను శుభ్రపరుచుకుని ఆ నీటిని తాగుతున్నారు.**

**పత్తికొండ, ఆగస్టు 20,ప్రభాతవార్త** హాస్టల్‌లో వారానికి ఒకసారి మోటర్ కాలిపోవడం పరిపాటిగా మారింది. హాస్టల్ వర్కర్లను అడిగితే బడ్జెట్ లేదు మేము ఏంచేయాలని సమాధానం చెబుతున్నారు. హాస్టల్‌ను పర్యవేక్షించే అధికారి లోపం వల్లే విద్యార్థులకు నీటికష్టాలు ఏర్పడుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పేద విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేసి వారికి వాడుకోవడానికి,తాగడానికి మంచినీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

## బోర్డు సభ్యుల సేవలో తరిస్తున్న.. దేవస్థాన చిరుద్యోగులు..?

*: మొక్కుబడిగా విధులకు హాజరు..! సమయమంతా సభ్యుల సేవలో...?*
*: చిరుద్యోగుల సేవలపై దృష్టిసారించని అధికార యంత్రంగం!!!*



**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు20,ప్రభాతవార్త** శివ...శివా ఓ శ్రీశైల మల్లన్న సొమ్ము ఒకరిది సోకు మరోకరిది అన్నసామేతలా.. శ్రీశైలం చిరుద్యోగుల తీరు ఇలా మారిందని క్షేత్రంలో కోడై కూస్తున్నారు కొందరు ఉద్యోగులు.జీతాభత్యాలు మల్లన్నవి సేవలన్ని ట్రస్ట్‌బోర్డు సభ్యుల సేవలో చిరుద్యోగులు తరిస్తున్నారని విమర్శలు గుప్పుమంటున్నాయి. క్షేత్రంలో వైరల్‌గా మారిన ఈ విషయం ఎంత వరకన్నది అ శ్రీశైల మల్లన్ననే నిగ్గుతేల్చాల్సి ఉంది..? శ్రీశైలం దేవస్థానంకు ప్రభుత్వం ధర్మకర్తల మండలి ఏర్పాటు చేసింది.రమారమి మొత్తం 15 మంది వరకు మండలి కమిటి కొనసాగుతుంది.ఈక్రమంలోనే సభ్యులకు దేవస్థానం నుండి ఒకోక్కరికి ఒకోక్క చిరుద్యోగిని సహయకారిగా ఉండేందుకు కేటాయించింది. మండలి సభ్యులు పాలక మండలి సమీక్ష సమావేశాలు ఉన్నప్పుడు, ఏదైన ప్రత్యేకమైన పర్వదినాలు ఉన్నప్పుడు,అబివృద్ది కార్యక్రమాల తీరు తెన్నులను పరిశీలించేటప్పుడు సభ్యులు శ్రీశైలంకు వస్తుంటారు.ఈ సమయంలోనే ఈ చిరుద్యోగులను వారు అవసరాల నిమిత్తం ఉపయేగించుకుంటుటారు. సభ్యుల తిరుగుప్రయాణం అనంతరం యాధావిదిగా వారికి కేటాయించి విధుల్లో వారు చేరి సేవలు అందించాలి చిరుద్యోగులు.అయితే ఇక్కడే కొందరు తిరకాసు మంత్రంను ఉపయేగిస్తూ అయ్యావార్లు చేప్పారు తమ బందువులు, స్నేహితులు, పరిచయస్తులు వస్తున్నారని గదులు చూడమన్నారని, దర్శనాలు చేయించమన్నారని సాకులు చేబూతూ అసలైన విధులకు మొకుబడిగా హాజరు వేయించుకోని సమయమంత సభ్యుల సేవల పేరుతో తప్పించుకు తిరుగుతన్నారని క్షేత్రంలో గుసగుసలు వినబడుచున్నాయి.సభ్యుల సేవలో తరించే చిరుధోగ్యగులు మిగత సమయాల్లో విధులకు హాజరౌతున్నారా లేదా...? అనేది సంబంధింత అదికార యంత్రంగం ఎందుకు చూడడం లేదన్నది ప్రశ్నర్థాకంగా మారింది.ఈ సాకులు చేప్పే సిబ్బంది రెండు చేతులా ఏమైన సంపాదనలో ఉన్నారా...? విధులకు హాజరుకాకుండా దర్శనలా పేరిటా ఏమైన లోగుట్టు నడుపుతున్నారా...?దుమ్మకోట్టే సిబ్బందికి అదికార యంత్రంగంకు సంపాదన వాటలో ఒప్పదం ఏమైనా ఉందా...? అనే ప్రశ్నలకు సమాదానాలు వెల్లడికావల్సి ఉంది.ఈ జరుగుతున్న లోగుట్టు మంత్రంపై క్షేత్రపాలకులు దృష్టి సారించి విధులకు తప్పించుకోని తిరుగుతున్న సిబ్బందిని ఆరా తీసి వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటే బాగుంటుందని అసలు విషాయాలు వెలుగు చూస్తాయని మల్లన్న భక్తులు కోరుతున్నారు.



## ఎంఈవోలు.. పెత్తనం పేచీలు..!

- ఇద్దరి ఎంఈవోల నడుమ కుమ్ములాటలు..
- విద్యాశాఖలో ఎంఈవోల రగడ..
- చిచ్చురేపుతున్న కొత్త విధానం..
- విధులన్నీ రెండో ఎంఈవోలకే..
- కుర్చీ దగ్గర నుంచి ప్రోటోకాల్ వరకు గొడవలే..
- రెండో ఎంఈవోలో సీనియర్లు.. మొదటి ఎంఈవోలు జూనియర్లు..
- ఇరువురి మధ్య రోజూ అధికార జగడాలే..
- కుంటుపడుతున్న విద్యావ్యవస్థ..

2లో

**"రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానంలో భాగంగా ఏర్పాటు చేసిన రెండో ఎంఈవోల నియమకంతో ఇరువురి మధ్య పేచీలు ఏర్పడుతున్నాయి.. దీంతో విద్యాశాఖలో రగడ రాజుకుంటోంది... రెండో ఎంఈవోల నియామక వ్యవహారం మండలాల్లో అధికారుల మధ్యపేచీలు పెంచుతోంది.. ఇంత కాలం ఒక్కొ మండలానికి ఒక్కొ ఎంఈవో ఉండగా జగన్ ప్రభుత్వం కొత్తగా వీరిని కాదని రెండో ఎంఈవో విధానాన్ని అమల్లోకి తెచ్చింది.. ఒకరికి ఉపాధ్యాల పర్యవేక్షణ, జీతాల బిల్లుల పని అప్పగించగా, రెండో ఎంఈవోలకు పాఠశాలల తనిఖీలు, పర్యవేక్షణ తదితర విధులు కట్టబెట్టింది.. ఇప్పడీ పని విభజన ఇద్దరు ఎంఈవోల మధ్య చిచ్చు పెడుతోంది"..**

**కోసిగి, ఆగష్టు 20, ప్రభాతవార్త** ఇంత కాలం మండలంలోని పనులు పర్యవేక్షించిన పాత ఎంఈవోలు, రెండో కొత్త ఎంఈవోలకు వీటిని వదిలి పెట్టకుండా ఇంకా పెత్తనం చేస్తుండడం గొడవలకు దారి తీస్తోంది.. ఎంఈవో(ఎంఆర్‌సీ) కార్యాలయాల్లో కుర్చీ మొదలుకుని గౌరవ మర్యాదల వ్యవహారంలో తమను చిన్నచూపు చూస్తుండడంపై మొదటి, రెండో ఎంఈవోల మధ్య పంచాయతీ పెరుగుతోంది.. పలు మండలాల్లో కొత్త ఎంఈవోలు గెజిటెడ్ హెచ్‌ఎంలు కాగా, మొదటి ఎంఈవోలు జూనియర్‌లు, ఇంకొన్ని మండలాల్లో దీనికి వ్యతిరేకంగా ఉండడంతో వీరిద్దరి మధ్య తరుచూ గొడవలు రాజుకుంటున్నాయి.. ఇలా ఒకటేమిటి ఇప్పుడు ఏ మండలంలో చూసినా వీరిద్దరి నడుమ కుమ్ములాటలే బయట పడుతున్నాయి.. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు సంబందించి ప్రతి జిల్లాలోను డీఈవో పరిధిలో ఒక్కొ మండలానికి ఒక్కొ మండల విద్యాధికారి పనిచేస్తున్నారు.. ఎన్నో ఏళ్లగా కొనసాగుతున్న ఈ విధానంలో ఆయా మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల జీతభత్యాల బిల్లులు, తనీఖీలు ఇలా అన్ని ఎంఈవో ఒక్కరే పర్యవేక్షించేవారు..

**విద్యాశాఖపై భారం:** రాష్ట్రంలో వైఎస్.జగన్ ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖపై మరింత భారం పెరిగింది.. విద్యార్థులకు మెనూ దగ్గర నుంచి వారికి ఇచ్చే అమ్మఒడి, పాఠశాల విద్యాకానుక, మధ్యాహ్న భోజనం ఇలా రకరకాల పథకాల అమలుకు సంబందించి ఏ రోజుకారోజు ట్యాబ్‌లల్లో ..

# ఎంఈవోలు.. పెత్తనం పేచీలు..!

**(తరువాయి)** ప్రభుత్వానికి హెచ్ఎంల దగ్గర నుంచి ఎంఈవోల వరకు సమాచారం పంపించాల్సిన పరిస్థితి నెలకొంది.. ఈ నేపథ్యంలో పని ఒత్తిడి పెరగడంతో కొన్ని నెలల క్రిందట ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వంపై తిరగబడ్డాయి.. పీఆర్సీతో పాటు రకరకాల పాత బకాయిలకు సంబందించి ఉద్యమానికి దిగాయి.. అప్పటి నుంచి విద్యాశాఖపై కక్ష పెంచుకున్న జగన్ ప్రభుత్వం ఉపాధ్యాయులను నానా రకాలుగా వేధింపులకు మొదలు పెట్టింది.. ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు ఇటీవల సమయానికి డిజిటల్ హాజరు తప్పనిసరి చేసింది.. ఆ తరువాత ఇప్పుడు ఉన్న ఎంఈవోల స్థానంలో కొత్తగా రెండో ఎంఈవోల విధానాన్ని ప్రవేశపెట్టి ఈ సంవత్సరం జూన్ నుంచి అమల్లోకి తెచ్చి గొడవలకు ఆజ్యం పోసింది.. ఫలితంగా ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో ఒక్కో మండలానికి ఇద్దరేసి ఎంఈవోలు విదులు నిర్వహిస్తున్నారు..

**క్షేత్రస్థాయిలో వివాదాలు.. విభేదాలు:**

ఎంఈవో హోదా కావడంతో అనేక మంది సీనియర్ హెచ్ఎంలు రెండున్నర నెలల క్రిందట ఈ బాధ్యతలను స్వీకరించారు.. తీరా క్షేత్రస్థాయిలో పని విధానం మొదలయ్యే సరికి ఎదురవుతున్న చిక్కులు, వివాదాలు, విభేదాలు, పంచాయతీలతో తలలు పట్టుకుంటున్నారు.. ఈ పోస్టు మా కొద్దు బాబోయ్ అంటూ పరుగులు తీస్తున్నారు.. వాస్తవానికి రెండో ఎంఈవోలను నియమించిన ప్రభుత్వం వీరికి కొత్తగా జాబ్ చార్టును ప్రకటించింది.. అందులో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చూడడం, పాఠశాలల తనిఖీ, డిజిటల్ బోధన వసతుల ఏర్పాటు, మధ్యాహ్న భోజనం అమలు, పాఠశాలలో శానిటేషన్ పర్యవేక్షణ, ప్రభుత్వ పథకాల అమలుకు సంబందించి రికార్డుల పర్యవేక్షణ తదితర విధులన్నీ రెండో ఎంఈవోలకు కట్టబెట్టింది.. మండలం పరిధిలోని ఉపాధ్యాయులపై అజమాయిషీ, జీతాల బిల్లులు, ఇతర సర్వీసు మేటర్సు వంటి విధులు పాత ఎంఈవోలకు కేటాయించింది.. పేరుకు పని విభజన జరిగినా క్షేత్రస్థాయిలో మాత్రం రెండో ఎంఈవోలపై మొదటి ఎంఈవోల పెత్తనం చేస్తుండడంతో ఇప్పుడు కొత్త ఎంఈవోలు రగిలిపోతున్నారు..

**ఇద్దరి మధ్య మొదలైన జగడం:**

ముఖ్యంగా మండలాల్లో ఏదైన పాఠశాల తనిఖీకి కొత్త ఎంఈవోలు వెళ్తే పాత ఎంఈవోలు కొర్రీలు వేస్తున్నారు.. మధ్యాహ్న భోజనం, పాఠశాలల శానిటేషన్ వ్యవహారాల్లోనూ జోక్యం అవసరం లేదంటూ వీరిని వెనక్కులాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.. కార్యాలయంలో కూర్చుంటే చాలని, తనిఖీలకు ఎవరి అనుమతి తీసుకున్నా రంటూ ప్రశ్నిస్తుండడంతో ఇద్దరు ఎంఈవోల మధ్య ఇప్పుడు అనేక మండలాల్లో లడాయి మొదలైంది.. తమ విధుల్లో ఎందుకు జోక్యం చేసుకుంటా రంటూ అన్ని మండలాల్లో ఎక్కడికక్కడ కొత్త ఎంఈవోలు పాత ఎంఈవోలతో పేచి పడుతున్నట్లు తెలుస్తోంది.. మరికొన్ని మండలాల్లో కొత్త ఎంఈవోలు అసలు మాట వినడం లేదని, పాత ఎంఈవోలు రగిలిపోతున్నారు.. డీఈవోలకు సైతం ఫిర్యాదులు పంపుతున్నట్లు తెలుస్తోంది.. మండలం నుంచి పంపించేయాలంటూ ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం.. అంతేకాక మరి కొందరైతే రాజకీయంగాను అధికార పార్టీ నేతల వద్దకు వెళ్తూ రెండో ఎంఈవోను తప్పించే పని వారికి అప్పగించినట్లు విశ్వాసంగా తెలుస్తోంది..

**జూనియర్‌ల పెత్తనం ఓర్చుకోని సీనియర్లు:**

జిల్లాలో సగం వరకు మండలాల్లో పాత ఎంఈవోలతో పోల్చితే కొత ఎంఈవోల్లో అనేక మంది సీనియర్ హెచ్ఎంలే.. వీరంతా గెజిటెడ్ హోదాలో ఉన్నవారు.. దీంతో జూనియర్ ఎంఈవో తమపై పెత్తనం చేయడం ఏంటని కొత్త ఎంఈవోలు ఓర్చుకోలేక రగిలిపోతున్నారు.. ఎంఈవో కార్యాలయాల్లో కుర్చీ దగ్గర నుంచి ఛాంబర్ వరకు కొత్త ఎంఈవోలకు పెద్దగా ప్రాధాన్యం లేకుండా పాత ఎంఈవోలు చాలామంది చక్రం తిప్పుతున్నారు.. తమ ముందు రెండో ఎంఈవోలు సబార్డినేట్‌లు అనే తీరులో వ్యవహారిస్తున్నట్లు తెలుస్తోంది.. రికార్డుల వర్కు చేయాలంటూ పనులు చెబుతున్నారు.. మేమెందుకు చేయాలి అంటూ రెండో ఎంఈవోలు ఎదురు తిరుగుతున్నారు.. దీంతో ఇరువురి మధ్య తగాదాలు జరుగుతున్నాయి.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు మండలాల్లో కొత్త ఎంఈవోలు పంచాయతీలు పెడుతున్నట్లు సమాచారం.. ఇలా ఒకటేంటీ అనేక విషయాల్లో ఇద్దరు ఎంఈవోల మధ్య తరచూ పేచీలు నడుస్తూనే ఉండడంతో ఏం చేయాలో తెలియక డీఈవోలు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకుంది.. ఈ తగాదాల నేపథ్యంలో తాము ఈ పోస్టులో ఉండలేమంటూ పలువురు కొత్త ఎంఈవోలు పైఅధికారుల వద్దకు క్యూలు కడుతున్నట్లు తెలుస్తోంది.. తమను తప్పించాలంటూ ఒత్తిడి తెస్తున్నారు.. తీరా కొత్త ఎంఈవోల కోసం చూస్తుంటే ఈ పంచాయతీలతో వేగలేక మిగిలిన వారు ఆ పోస్టు వైపు చూడడానికి సైతం సాహసించడం లేదు.. ఏది ఏమైన మండలంలో ఇద్దరి ఎంఈవోల మధ్య సయోధ్య కుదిరితేనే ఆ మండలంలో విద్య వ్యవస్థ మెరుగుపడుతుందని చెప్పవచ్చు..

## ఉగ్రవాద కదలికలు ఉన్నాయా...?

**(తరువాయి)** గత సంవత్సరంలో కర్నూలు ఎస్పీగా పనిచేసిన సుధీర్ కుమార్ రెడ్డి ఈ విషయంపై చాలా లోతైన విచారణ చేశారు. ఆ మేరకు ఆయన కొందరు నిపుణులైన అధికారులతో ప్రత్యేక విచారణలు చేయించారు. ఆ మేరకు ఎస్‌బిలో పనిచేస్తున్న పోలీసులకు హెచ్చరికలు కూడా జారీ చేశారు. అదే క్రమంలో ఆయన కేంద్ర ప్రబుత్వానికి నివేదిక అందించారు. అప్పటికి పీఎఫ్ఐ సంస్థపై నిషేధం లేదు. ఆయన ఇచ్చిన నివేదిక కూడా నిషేధం విషయానికి కొంత సపోర్టు అయిందన్న వాదన కూడా ఉంది. ఆ సమయంలో అప్పటి ఎస్‌బి అధికారులకు ప్రత్యేక సూచనలు ఇచ్చి పిఎఫ్ఐతో పాటు ఇతర సంస్థలపై నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. తర్వాత ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌పై దాడి జరిగిన నేపథ్యంలో ఆయన మరింత నిక్కచ్చిగా వ్యవహరించి కొందరు పోలీసులను బదిలీ చేశారు. ఆయన బదిలీతో ఆ విషయంపై ఆసక్తి తగ్గిపోయింది. అదే క్రమంలో అప్పుడు ఎస్‌బిలో పనిచేసి ఆ విషయాలపై నిఘా పెట్టిన అధికారులు నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో సదరు వ్యవహారం పూర్తిగా మరుగున పడినట్లేనని తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా కర్నూల్‌లో పనిచేస్తున్న నిఘావర్గాలు ఈ విషయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఎన్ఐఏ అధికారులు మరో కుట్ర జరిగే అవకాశం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అందుకు గాను తాజా విచారణలతో సంబంధం ఉన్న ప్రతి విషయంలో నిఘా ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. మరి కుట్ర జరిగితే ఎక్కడ జరుగవచ్చు కర్నూలులోనా లేక నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాల లోనా అన్న విషయంపై తెలంగాణ పోలీసులు విచారిస్తున్నారు. ఈ విషయంలో ఎన్ఐఏతో పాటు తెలంగాణ పోలీసులు కూడా అప్రమత్త ం అయ్యారు. ఏది ఏమైనా ఎన్ఐఏ విచారణలలో మరో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తే... జిల్లా పోలీసుల పనితీరుపై విమర్శలు వచ్చే అవకాశం లేకపోలేదు.

## ఐటి రంగానికి పునాదులు వేసిన మహోన్నత వ్యక్తి రాజీవ్‌గాంధీ

**హొళగుంద, ఆగస్టు 20, ప్రభాతవార్త**

ఐటీ రంగానికి పునాదులు వేసిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అమానుల్లా అన్నారు. ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 79వ జయంతి వేడుకలు మండల కేంద్రమైన హొళగుందలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఐటీ రంగానికి పునాదులు వేసిన మహోన్నత వ్యక్తి రాజీవ్‌గాంధీ అని అలాగే గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి నిధులు విడుదల చేశారన్నారు. 18సం॥లు నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీదేనని అన్నారు. టెక్నాలజీ రంగం రాజీవ్‌గాంధీ హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల అభివృద్ది కాంగ్రెస్ పార్టీ సాధ్యమన్నారు. అలాగే టెలీకమ్యూనికేషన్ ఉందంటే అది రాజీవ్‌గాంధీ కృషి వలనేనని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిఒక్కరు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ. 6లక్షల వరకు రుణమాఫీ, ఫించన్ రూ. 4వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏపికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ పర్వప్ప, బండ్రాళ్ల తిమ్మప్ప, రాజు, ఎం ఖలీల్, ముస్తఫా, యూసుఫ్, లక్ష్మమ్మ, శేఖన్న, బసవరాజు, గౌరప్ప తదితరులున్నారు.

## రామాలయంలో ఘనంగా నాగులచవితి వేడుకలు



**నంద్యాల టెక్కె, ఆగస్టు 20, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లాలో స్వస్థశ్రీ శోభకృతనామ సంవత్సరం శుక్లపక్షం వర్షరుతువు, నిజశ్రావణమాసం సందర్బంగా ఆదివారం నాగులచవితి పండుగను సంజీవనగర్ రామాలయంలో ఘనంగా నిర్వహించారు. సుబ్రమణేశ్వరస్వామికి పాలాభిషేకం నివేదన సమర్పించారు. శ్రీభగవత్‌సేవా సమాజ్ అద్వర్యంలో అధ్యక్షులు సముద్రాల సూరయ్య, ప్రధాన కార్యదర్శి వంకదార మధుసూదన్‌రావు, కోశాధికారి మాఘం గురుప్రసాద్, దేవరశెట్టి శ్రీనివాస్, అధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు, అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. స్వామికి పాలుపోసి నూలుదారం చుట్టి ముడుపులు చెల్లించి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. నాగులచవితి పర్వదినం సందర్బంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పట్టణంలోని వివిధ మతాలకు చెందిన వారు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



**నంద్యాల రూరల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** నంద్యాల మండలం కానాల గ్రామంలో వెలసిన శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణేశ్వరస్వామి వారికి ఆదివారం నాగులచవితి సందర్బంగా భక్తులు, అర్చకులు, అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. భక్తులు పుట్టకు పాలుపోసి నూలుదారం చుట్టి స్వామివారికి ముడుపులు చెల్లించి భక్తులు తమ తమ మొక్కులను చెల్లించుకున్నారు. కానాల గ్రామంతో పాటు సమీపంలో ఉన్న హైస్కూల్‌కొట్టాల రామకృష్ణాపురం కొట్టాల, రైతునగరం, ఎం చింతకుంట, చాపిరేవుల, నూనెపల్లె, మూలసాగరం తదితర ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పుట్టలో పాలుపోసి స్వామివారికి నైవేద్యంసమర్పించారు. అర్చకులు జగదీష్‌బాబు, సతీష్‌శర్మల అధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఆదివారం నాగులచవితి పర్వదినం రావడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శనం చేసుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

## సిపిఐ బస్సుయాత్రను జయప్రదం చేయండి

**నంద్యాల టెక్కె, ఆగస్టు 20, ప్రభాతవార్త:**

దేశాన్ని కాపాడండి అంటూ విశాఖపట్నం నుంచి ప్రారంభమైన సిపిఐ బస్సుయాత్ర నంద్యాల జిల్లాలో ప్రవేశిస్తున్నసందర్బంగా బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈరాష్ట్రంలో, దేశంలో అవినీతితో కూరుకుపోయిన ఈప్రభుత్వాలను కదిలించేందుకు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని అందులో భాగంగానే ఈబస్సుయాత్ర చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్, జిల్లా కో-కన్వీనర్ సోమన్న, కోశాధికారి లక్ష్మీదేవిలు పాల్గొని ప్రసంగించారు. సమావేశాలకు వ్యవసాయ కార్మికులను, కూలీలను, ప్రజలను పెద్ద ఎత్తున పాల్గొనేవిధంగా తరలివచ్చి సెప్టెంబర్ 1న జరిగే సిపిఐ బస్సుయాత్రను జయప్రదం చేయాలని వారు కోరారు. అనంతరం నంద్యాల మండలం వ్యవసాయ కార్మిక సంఘంనూతన 11 కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. నంద్యాలమండల అధ్యక్షులుగా మద్దిలేటి, కార్యదర్శిగా మహబూబ్‌బాష, నరేష్, సుబ్బరాముడు, సుంకన్న, రమణ, మోహన్, రాజు, ఈశ్వరయ్య, ఎస్‌కె ముని, కాశీంలను ఎన్నుకున్నారు. సమాజంలో పలువురు సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళాప్రపూర్ణ కీ.శే.పాతూరి నాగభూషణం 117వ జయంతి వేడుకలు

**కర్నూలు విద్య, ఆగస్టు 20, ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయం నందు ఆదివారం కళాప్రపూర్ణ కీ.శే.పాతూరి నాగభూషణం 117వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటి లైబ్రేరియన్ వి పెద్దక్క, సహాయ గ్రంథాలయ అధికారి వజ్రాల గోవిందరెడ్డి, గ్రంథాలయ అధికారి ఎస్ బాష, రికార్డు అసిస్టెంటు ఈశ్వరమ్మలు కలిసి ముందుగా పాతూరి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతిప్రజ్వలన ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటి లైబ్రేరియన్ మాట్లాడుతూ పాతూరి వారు గ్రంథాలయ అభివృద్ధికి ప్రత్యేక కృషిచేయడం జరిగిందన్నారు. విజయవాడలోని గ్రంథాలయ శిక్షణాలయం ఏర్పాటుచేసి మంచి లైబ్రేరియన్‌లను తయారుచేశారని కొనియాడారు. అసిస్టెంటు లైబ్రేరియన్ మాట్లాడుతూ పాతూరి నాగభూషణం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొని గ్రంథాలయ అభివృద్ధి కోసం కృషి చేశారని ప్రభుత్వం వారు వారికి కళా ప్రపూర్ణ బిరుదునిచ్చి గౌరవించిందన్నారు. వీరు గ్రంథాలయ నిర్వహణ, వయోజన విద్యలో నైపుణ్యం గలవాడని వారి సేవలను తెలియజేస్తు జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠకులు, లైబ్రేరియన్లు కలిసి పాతూరి వారికి ఒక నిమిషం మౌనం పాటించి నివాళ్లు అర్పించారు.

## వాహనాల తనిఖీ

**దేవనకొండ, ఆగస్టు 20, ప్రభాతవార్త** దేవనకొండ టర్నింగ్ దగ్గర ఆదివారం ఎస్ఐ భూపాలుడు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన దస్త్రాలు సక్రమంగా లేని వాహనదారులకు తగు జరిమాన విధించారు. ప్రతిఒక్క వాహనదారుడు దస్త్రాలు, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు రహదారి, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

## నేషనల్ హైవే పనులలో స్థానికులకు అవకాశం ఇవ్వాలి

**నందికొట్కూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త:**

నేషనల్ హైవే పనులలో స్థానికులైన ఆపరేటర్ల, డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని ఏఐటియుసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జైకిసాన్ పార్కులో జరిగిన జేసిబి, ఎక్స్‌కావేటర్ ఆపరేటర్స్, ట్రిప్పర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఏఐటియుసీ రాష్ట్ర నాయకులు ఎం.రమేష్, జిల్లా అధ్యక్షులు వి.రఘురాంమూర్తి మాట్లాడుతు డ్రైవర్స్ రోడ్డు వెడెల్పు పనులలో ఇతర రాష్ట్రాల వారికన్న మొదటిగా అన్ని కోల్పోతున్న స్థానికులకు ఉపాది చూపాలన్నారు. తక్కువ వేతనాల పేరుతో ఇతర ప్రాంతాల వారిని నియమించుకొని స్థానికులను పట్టించుకోక పోతే పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం ఆపరేటర్స్ డ్రైవర్స్ తాలుకా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా ఆర్.రమేష్, కో-కన్వీనర్‌గా సాంబశివుడు, బాలు, నాగేంద్ర, నాగేష్, నాగార్జునను ఎన్నుకున్నారు.

## పేరుకే ప్రపంచ దోమల దినోత్సవ కార్యక్రమం

**మద్దికెర, ఆగస్టు 20, ప్రభాతవార్త**



ప్రపంచమంతా దోమల దినోత్సవం చేస్తుంది.. కాబట్టి మేము చేస్తున్నాం..అన్నట్లుగా మద్దికెర వైద్య సిబ్బంది ఆదివారం ర్యాలీ నిర్వహించారు. మద్దికెర మండలంలో ఎక్కడి పారిశుద్ధ్య పనులు అక్కడే ఆగిపోయి అంటురోగాలతో ప్రజలు అల్లాడుతూ రూ.వేలకు వేలు ఆసుపత్రులకు ఖర్చు చేస్తున్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పేరుకే ప్రపంచ దోమల దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రజల్లో సరైన అవగాహన కల్పించడం లేదని వాపోతున్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు రకాల మందులు రాస్తే రెండు రకాలు ఇచ్చి మిగిలిన రెండు రకాలు బయట తెచ్చుకోమని చెప్పడం జరుగుతుందని ఈ మద్యకాలంలో మలేరియాకి గురైన భాదితులు తెలిపారు. వివిధ పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాల్లో ఎక్కడి పారిశుద్య పనులు అక్కడే నిలిచిపోయి ఇంటి చుట్టుపక్కల మురుగునీరు నిల్వ ఉండడం వలనే మలేరియా వ్యాధులు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా సాయినగర్, రాంనగర్, ఎస్‌సి కాలనీలో విపరీతమైన దోమల బెడద ఉన్నప్పటికీ తూతూమంత్రంగా బ్లీచింగ్ పౌడర్, సున్నంతో పారిశుద్య పనులు కొనసాగిస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. పారిశుద్య పనులు చేయకుండ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారని అదే పార్టీలోని కొందరు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు మేల్కొని ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన భాద్యత ఎంతైనా ఉందని గుర్తు చేసుకుని పారిశుద్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## పాముల చిరంజీవి..ఎటువంటి పామైనా ఈజీగా పట్టేస్తాడు

**- ఒక్క ఫోన్‌కాల్ కొడితే క్షణంలో ప్రత్యక్షం.. చిరంజీవి సేవలపై ప్రజల హర్షం**



**పెద్దకడబూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త:** పాము కనిపిస్తే భయపడుతూ పరుగులు పెడుతుంటాం. పొరపాటున ఇంటిలోకి పామువస్తే కుటుంబ సభ్యులంతా రోడ్డుపై వచ్చి ఆందోళన చెందుతారు. ఒకవేళ పాము దొరకకపోతే ఆ ఇంటిని ఖాళీ చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. కానీ ఓ యువకుడు పాము కనిపిస్తే చాలు ఎలాంటి భయం లేకుండా పాము ఎక్కడున్నా, ఎటువంటి పామైనా ఈజీగా పట్టేయడం చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఆ యువకుడే మండల పరిధిలోని కల్లుకుంట గ్రామానికి చెందిన చిరంజీవి. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకడ బూరులోని ఓ ఇంటిలో రెండు రోజులక్రితం పెద్దపాము కనిపించింది. ఇంటలో ఉన్నవారు భయంతో బయటకు పరుగులు తీశారు. పామును చంపడానికి ఎంత ప్రయత్నించినా దొరక్కపోవడంతో కొంతమంది యువకులు చిరంజీవికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి వచ్చిన చిరంజీవి ఇంటిలో ఉన్న పెద్దపామును పది నిమిషాల్లో పట్టేసి తన మెడలో వేసుకొనిఊరి బయటకు తీసుకెళ్ళారు. పాము దొరకడంతో ఇంటిలో ఉన్నవారు హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి అంత్రము, మంత్రము లేకుండాచిరంజీవి పామును పట్టేసి ఆపదలో ఉన్నవారికి తోడుగా నిలవడం పట్ల పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూలిపనులు చేసుకొని జీవించేచిరంజీవి మండలంలోని ఏ గ్రామంలో పాము కనిపించినా క్షణాల్లో ప్రత్యక్షమై ఎటువంటి సాయం ఆశించకుండా పాములను పట్టేయడం అభినందనీయమన్నారు. చిరంజీవి కష్టానికి ప్రభుత్వం ఉపాధి కల్పించి ఆదుకోవాలని ప్రజలు, స్వచ్చంద, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు. ఎవరి ఇంటిలో పాము కనిపించినా నా ఫోన్ 8501922376 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

## ఐటిరంగ విప్లవ వీరుడు రాజీవ్‌గాంధీ

**- రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఘనంగా**

**నంద్యాల విద్య, ఆగస్టు 20, ప్రభాతవార్త:** స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఐటి రంగాన్ని భారతదేశానికి పరిచయం చేసిన గొప్ప మహానాయకుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని కాంగ్రెస్ పార్టీ పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.చింతల మోహన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దాసరి చింతలయ్య అధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అఫీసు నందు రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి, పొన్నాపురం కాలనీలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాధునిక సైన్స్, టెక్నాలజీని అందించిన గొప్ప దూరదృష్టి ఉన్న నేత రాజీవ్‌గాంధీ అని యువతను రాజకీయాల్లో భాగస్వామ్యం చేయాలని సమాజంలో యువత బాగుండాలని, 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. ఈదేశంలో కోసం తన చివరి ఊపిరి ఉన్నంత వరకు అవిశ్రాంతంగా పనిచేసిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అని ఇటువంటి వ్యక్తులను యువత ఆదర్శంగా తీసుకోవాలని యువత ఈ దేశ ప్రగతికోసం పాటుపడాలని పేర్కొన్నారు. అతిచిన్నవయసులోనే భారత ప్రధాని పదవి చేపట్టి ఎన్నో ఆదర్శకార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. రాజీవ్‌గాంధీ 1991 మే 21న తమిళనాడులోని చెన్నై సమీపంలో శ్రీపెరంబుధూర్‌లో ఎన్నికల ప్రచారంలో ఉండగా హత్యకు గురయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు విజయలక్ష్మీ, చాబోలు సలాం, రఫీ, బాలకృష్ణ, ప్రియ, సరితా, సునీత పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మినగర్ ప్లాట్లకు నష్ట పరిహారం చెల్లించండి

**నందికొట్కూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త:** మున్సిపాల్టి పరిధిలో ప్రభుత్వంచే గుర్తించ బడిన శ్రీక్ష్మీనగర్ వెంచర్‌లో 340సి జాతీయ రహదారి కింద ప్లాట్స్ కోల్పయామని వాటికి నష్ట పరిహారం ఇవ్వాలని భాధితులు నంద్యాల జాయింట్ కలెక్టర్ రాహూల్‌కుమార్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఆదివారం ఎన్ హెచ్ ఎ కింద నందికొట్కూరు, దామగట్ల, బ్రాహ్మణకొట్కూరు, 10.బొల్లవరం గ్రామాలలో భూములను కోల్పయిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో చర్చించారు. రైతులు తమకు చాల తక్కువ ధరకు నష్టపరిహారం ఇస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తు పనులు ఆపేందుకు సిద్దం కావడంతో ఆయన వారితో మాట్లాడుతు భూమి ధరపై విచారణ చేస్తామని మార్కెట్ ధర ప్రకారం ల్యాండ్ అక్యువేషన్ చట్టబద్ధతతో మీకు న్యాయం చేస్తామని పనులకు ఆటంకం కల్పించరాదని జేసి తెలిపారు. లక్ష్మీనగర్ వెంచర్‌లో ప్లాట్స్ కోల్పోయిన వారు జేసితో మాట్లాడుతు ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంక్ ఖాతా పాటు పూర్తి వివరాలు అందజేశామని, చుట్టుప్రక్కల వారికి పరిహారం వచ్చిందని అయిన మాకు రాలేదని వారు తెలిపారు. దీనిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. తహసిల్దార్ పుల్లయ్యయాదవ్, హౌసింగ్ పీడి బాస్కర్‌నాయుడు, డిప్యూటి తహసిల్దార్ సత్యనారాయణ, మండల సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

## పూడూరు, పడిదంపాడు గ్రామాల రోడ్డు దుర్భరం

**- హామీలిచ్చి మరిచిన అధికారులు**

**కర్నూలు రూరల్, ఆగస్టు 20, ప్రభాతవార్త :** కోడుమూరు నియోజకవర్గం కర్నూలు మండలంలోని పూడూరు, పడిదంపాడు గ్రామాలకు రోడ్డు దుర్భరంగా ఉందని కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జ మీసాల ప్రేమ్‌కుమార్, కన్వీనర్ సద్దల మధుకిషోర్‌లు అన్నారు. ఆదివారం పూడూరు, పడిదంపాడు గ్రామాల ప్రజలను కలిసి త్వరలో రిలేనిరాహార దీక్ష చేయాలని నిర్ణయించడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ మాసంలో గ్రామప్రజలతో కలిసి బిజెపి ఆద్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పూడూరు, పడిదంపాడు గ్రామ ప్రజలు దాదాపు 500మంది జాతీయ రహదారిని మూడు గంటల పాటు నిర్బంధించి వాహనాలను అడ్డుకోవడం జరిగిందని అయితే అప్పటి కలెక్టర్ హామీ మేరకు త్వరలోనే రోడ్డు వేస్తామని చెప్పగా వారి మాటను గౌరవించడం జరిగిందన్నారు. అయితే అప్పటి నుండి అనేకమార్లు ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగినా ఇంతవరకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు కర్నూలుకు రావాలంటే దాదాపు గంటన్నర సమయం పడుతుందన్నారు. బాలింతలు, హృద్రోగులు, అత్యవసర చికిత్స కావాల్సిన వారు, విద్యార్థులు పట్టణానికి రావాలంటే చాలా సమయం పడుతుందని ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని ప్రజలు అనేకమార్లు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారన్నారు. సార్వత్రిక ఎన్నికలను మరియు సంస్థాగత ఎన్నికలను వారు ఆర్టీఓ పాల్గొనకుండ బహిష్కరించారన్నారు. అలాగే గత పదిహేను సంవత్సరాలుగా ఎన్నోసార్లు వినతిపత్రాలు అందించినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. తహశీల్దార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ, కలెక్టర్ ఇలాంటి పెద్దపెద్ద అధికారులు ప్రత్యక్షంగా గ్రామానికి వచ్చి హామీ ఇచ్చినప్పటికీ రోడ్డు ఇప్పటికీ రాలేదన్నారు. కావున రిలే నిరాహార దీక్షలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయానికి యువత, గ్రామపెద్దలు, మహిళలు మద్దతు తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షులు మౌలాలి, జిల్లా ఓబిసి మోర్చ కోశాధికారి మహేంద్ర, గ్రామ పెద్దలు శేషన్న, సర్వేశ్వరయ్య, వెంకటేశ్వర్లు, యువమోర్చ నాయకులు రవికుమార్, ఎస్‌సి మోర్చ నాయకులు చిన్న పాల్గొన్నారు.

## 23న ఎమ్మిగనూరులో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం

**దేవనకొండ, ఆగస్టు 20, ప్రభాతవార్త :** ఈ నెల 23న ఎమ్మిగనూరులో సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం అనే అంశంపై ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు దేవనకొండ వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున ఆదివారం ప్రభాతవార్తకు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మద్దూరు సుభాష్ చంద్రబోస్, దేవపూజ, ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య, బడుగు, బలహీన వర్గాల ఐక్యవేదిక సభ్యులు హాజరవుతారన్నారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో తమ సామాజిక వర్గానికి సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ అభ్యున్నతికి న్యాయం జరుగుతుందా..లేదా..అని ప్రతిఒక్కరు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మన సామాజిక వర్గాలకు న్యాయం చేస్తారనే నమ్మకంతో మనమంతా వైసిపి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరుదామన్నారు. 2024లో మరోసారి అఖండ విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, నాయకురాళ్లు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## రైతుల ఆత్మహత్యకు కారకులు వీరేనా..!?

**- అన్ని అనుమతులతోనే అమ్ముతున్నారా..**

**మద్దికెర, ఆగస్టు 20, ప్రభాతవార్త**



మద్దికెర మండలంలో పుట్టగొడుగుల్లా ఫర్టిలైజర్స్, కెమికల్స్ షాపులు పుట్టుకొస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోయారు. దొంగ దొరికే వరకు తెలియదు దొంగతనం జరిగిందనే విషయం. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలో ఒక కెమికల్స్ షాపును వ్యవసాయాధికారి గత కొన్నిరోజుల క్రితం తనిఖీ చేయగా రూ.1,17,790ల స్టాక్ బుక్‌లో ఎంటర్ చేయకుండ నిల్వ ఉన్నట్లు గుర్తించి ఆ స్టాక్‌పై పదిరోజుల వరకు వారికి అవకాశం ఇవ్వడం జరిగింది. తదనంతరం వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అయితే రూ.5లక్షలకు పైగా స్టాక్ బుక్‌లో కెమికల్స్ నమోదు చేయకపోగా, అధికారులు మాత్రం రూ.2లక్షలలోపు చెప్పడం జరిగిందని గ్రామంలో రైతులు అంటున్నారు. గత రెండేళ్ల నుండి మండలంలో విపరీతంగా రైతుల ఆత్మహత్యలు పెరగడానికి కారణం నకిలీ మందులు, విత్తనాలేనని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని మారుమూల మండలం కావడంతో జిల్లా ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడకుండ ఉండడంతో ఫర్టిలైజర్స్, కెమికల్స్ షాపుల యజమానులు రైతుల ప్రాణాలు బలిగొని తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు..ఆరు కాయలుగా..కొనసాగించుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మచ్చ తేవడానికి అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి వెళ్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులతో చెలగాటమాడే షాపులపై దాడులు నిర్వహించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## తెదేపా అధికారం చేపడితే రూ.3వేలు నిరుద్యోగ భృతి

**- బీసీ ఇందిరమ్మ**

**- అబ్బులాపురంలో తెదేపా భవిష్యత్తుకు గ్యారంటీ ..**



**అబ్బులాపురం(కొలిమిగుండ్ల), ఆగస్టు 20, ప్రభాతవార్త**

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టగానే నిరుద్యోగ యువకులకు రూ.3వేలు నిరుద్యోబ భృతి అందించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధనరెడ్డి సతీమణి, బీసీ ఇందిరమ్మ పెర్కొన్నారు. ఆదివారం కొలిమిగుండ్ల మండలంలోని అబ్బులాపురం గ్రామంలో 'భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో బాగంగా మహాశక్తి ప్రచార కార్యక్రమాన్ని బీసీ ఇందిరమ్మ అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, గ్రామ టిడిపి నాయకులు శ్రీనివాసాచారి, వెంకటరామిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, లక్ష్మీనారాయణమ్మ తదితరుల ఆధ్వర్యంలో బీసీ ఇందిరమ్మకు స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ తిరిగి తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళలకు ఆడ బిడ్డ నిధి కింద ఏడాదికి రూ.18వేలు, ఉచిత బస్సు కల్పించాలని తెదేపా నిర్ణయించిందని అన్నారు. మహాశక్తి ప్రచార కార్యక్రమానికి ప్రజల నుండి అపూర్వ స్పందన లభించినట్లు బీసీ ఇందిరమ్మ తెలిపారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారి, తీవ్రంగా నష్టపోయిందని, తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుపడుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల టిడిపి నాయకులు, పెద్ద ఎత్తున తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు

**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు 20, ప్రభాతవార్త**

శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా(నిత్య కళారాధన కార్యక్రమంలో బాగంగా)ఆదివారంనాడు శ్రీ నటరాజ నృత్య కళాశాల శ్రీశైలం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. కాగా ఆలయ దక్షిణ మాడవీదిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వినాయకకౌత్వం, శివాష్టకం, శివస్తుతి, ఓం నమ:శివయా తదితర గీతాలకు డా.వేదాంతం రాధేశ్యాం, సిద్దేంద్రవరప్రసాద్, రమ్య, గీతాకృష్ణ, శేషబాబు తదితరులు నృత్యప్రదర్శన చేసారు. ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజు సంప్రదాయనృత్యం, వాయిద్య సంగీతం, భక్తి రంజిని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ ధర్మపథం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

## సిపిఐ ప్రచార జాత బస్సుయాత్ర జయప్రదం చేయండి

**మద్దికెర, ఆగస్టు 20, ప్రభాతవార్త**

సిపిఐ ప్రచార జాత బస్సు యాత్ర జయప్రదం చేయాలని రామచంద్రయ్య అన్నారు. ఈ సందర్బంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నిత్యవసర వస్తువులు విపరీతంగా పెంచి నిరుపేదలకు జీవనం కొనసాగించకుండ చేస్తుందన్నారు. ప్రజలను బానిసలను చేసి ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయన్నారు. ఆగస్టు 17న బస్సు యాత్ర ప్రారంభమైందని సెప్టెంబరు 8న తిరుపతిలో భారీఎత్తున ముగింపు సభ ఉండబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతుసంఘం సభ్యులు హనుమప్ప, నాగరాజు, వీరాంజనేయులు, నాగరాజు, పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగం రాలేదని.. యువకుడు ఆత్మహత్య

**వెలుగోడు, ఆగస్టు 20,ప్రభాతవార్త**

ఉద్యోగం రాలేదని యువడకుడు ఆత్మహత్య చేసుకొన్న సంఘటన వెలుగోడు పట్టణంలో చోటు చేసుకొంది. వెలుగోడు పట్టణానికి చెందిన యువకుడు శీలం స్టిఫెన్ మనస్థాపనికి గురై ఈనెల 18న ఇంటి నుంచి వెళ్లిపోయ్యాడు. యువడకుడి తల్లితండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేస నమోదు చేసి హెడ్ కానిస్టేబుల్ మాధవరావు దర్యాప్తు చేపట్టారు. యువకుడి మృతదేహం తెలుగుంగ కాల్వలో ఆదివారం మత్స్యకారులకు లభించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని యువకుడి మృతదేహన్ని పోస్టుమార్టంకు తరలించారు.

## తెలంగాణ యువకుడు కిడ్నాప్..

**- ఆలూరులో కిడ్నాపర్లను పట్టుకున్న పోలీసులు**





**ఆలూరు, ఆగస్టు 20,ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్రంలోని వికారాబాద్ జిల్లా కోతగది గ్రామానికి చెందిన నిరంజన్ అనే యువకుడికి రంగారెడ్డి జిల్లా కడ్తల్ వద్ద తమ నర్సరీ నుండి నిరంజన్ అనే 16ఏళ్ల బాలుడిని ఆదివారం ఉదయం నలుగురు బలవంతంగా కెఏ28ఎన్7535నంబరు కారులో కిడ్నాప్ చేశారు. ఆ బాలుడి వద్ద ఉన్న సెల్ నుంచి తల్లి లక్ష్మికి కిడ్నాపర్లు ఫోన్ చేశారు నీ కొడుకును కిడ్నాప్ చేశామని డబ్బులిస్తే వదిలేస్తామని బెదిరించారు. వెంటనే ఆమె అరండల్ పోలీస్‌స్టేషన్ సిఐకు సమాచారం అందించారు. సిగ్నల్స్ ఆధారంగా గుర్తించిన పోలీసులు కర్నూలు జిల్లా ఆలూరు పోలీసులకు సమాచారం అందించారు. కిడ్నాప్ సమాచారం తెలియగానే జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు అప్రమత్తమైన ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ డాక్టర్ నాయక్, సిబ్బంది నవీన్, జానీవాకర్ వాహనాలను తనిఖీ చేయగా ఆలూరు అంబేద్కర్ కూడలిలో వాహనాన్ని గుర్తించి కిడ్నాపర్లను అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కణేకల్‌కు చెందిన బసవరాజు, భుజంగం, చిలుకూరి కుమార్, సాయిలను అదుపులోకి తీసుకున్నారు. వారిని తెలంగాణ పోలీసులకు అప్ప గిస్తామని ఆలూరు ఎస్ఐ తెలిపారు.

## నీళ్ళట్యాంకులో పడి మహిళ మృతి

**మాధవరం(మంత్రాలయం), ఆగస్టు 20,ప్రభాతవార్త:**



మండల పరిధిలోని మాధవరం గ్రామంలో నీళ్ళట్యాంకులో పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటనన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు గ్రామానికి చెందిన కటికతాబేరా(43) అనే మహిళ తమ ఇంటివద్ద ఉన్న నీళ్ళ ట్యాకులంలో నీళ్ళు తీసుకోకోవడానికి ట్యాంకు వద్దకు వెళ్ళి కాలుజారి నీళ్ళ ట్యాంకులో పడిపోయింది. ట్యాంకు పెద్దది కావడంతో కుటుంబ సభ్యులు గమినించి ట్యాంకులో నుండి మహి ళను బయటకు తీశారు. అయితే అప్పటికే మహిళ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలుసుకున్నారు. మహిళ మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

## లాటోను ఢీకొన్న లారీ.. ఇద్దరు మహిళలకు గాయాలు

**మంత్రాలయం, ఆగస్టు 20,ప్రభాతవార్త:**





మండల పరిధిలోని బాధవరం గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. ఆటో పల్టీపడి పనికిరాకుండా పోయింది. మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపిన వివరాల మేరకు తమిళనాడు రాష్టానికి చెందిన ఓ లారీ గుజరాత్ నుండి చిత్తూరుకు వెళుతోంది. అయితే మాధవరం వంక దగ్గర రాంపురం నుండి మంత్రాలయం వెళుతున్న ఆటోను వెనుకనుండి బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న సోఫియా అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మరో మహిళ మాత్రం ఆటోనుండి కిందికి దూకేసింది. మహిళ స్వల్ప గాయాలతో బయటపడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. వివరాలు సేకరించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఆటోను ఢీకొన్నట్లు పోలీసులు విచారణలో తేలింది. తీవ్ర గాయాలపాలైన మహిళను ఓ వాహనంలో మెరుగైన వైద్యం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాధవరం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పల్లకీ ఉత్సవం

**శ్రీశైలంప్రాజేక్టు, ఆగస్టు20, ప్రబాతవార్త**

లోక కల్యాణం కొసం దేవస్థానం ఆదివారంనాడు రాత్రి శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా (సర్కారిసేవగా) జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తు అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహగణపతి పూజ జరిపించబడింది. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి.



# ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఆదివారం ఆఫ్‌డే..!

**- డ్యూటీ డాక్టర్ ఎవరని అడిగితే చిందులేస్తున్న నర్సులు..**





**పత్తికొండ, ఆగస్టు 20,ప్రభాతవార్త**

పత్తికొండ నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆదివారం మద్యాహ్నం నుండి వైద్యులు ఓపి బ్లాక్‌ను బంద్ చేసి విశ్రాంతి భవనంలో విశ్రాంతి తీసుకున్నట్లు ఆసుపత్రికి వచ్చిన రోగులు ఆరోపిస్తున్నారు. వైద్యులు ద్యుటీకి వచ్చినట్లు ఫేసియల్ రికాగ్నేషన్(ఫేస్‌యాప్) వేసి విశ్రాంతి భవనంలో కాల యాపన చేస్తున్నారు. వైద్యులు కుర్చీలో కూర్చోక పోవడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు ఎవరిని అడ గాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న నర్సులు రోగులకు సరైన సమాధానం ఇవ్వడం లేదని చికిత్స నిమిత్తం వచ్చిన వ్యాధిగ్రస్తులు వాపోతున్నారు. ఆదివారం ప్రతిభ కళా శాల పక్కనున్న కాలనీవాసులు డాకర్టును సంప్రదిం చడానికి వస్తే అప్పటికే ఓపి విభాగం మూత వేదయంతో డాక్టర్ కోసం వేచి ఉన్నారు. ఇంతలో రిపోర్టర్లు వచ్చి డ్యూటీ డాక్టర్ ఎక్కడ అని అడగడంతో నర్సులు ఏం సమాధానం చెప్పాలో తెలియక.. పడు కున్న డాక్టర్‌ను లేపలేక.. వారిపై చిందులేశారు. స్టాఫ్ నర్సు డాక్టర్‌కు ఫోన్ చేసిన ఎత్తకపోవడంతో సెక్యూరిటీ గార్డును పంపించారు. సెక్యూరిటీ గార్డు డోర్ కొడుతున్నా ఎంతసేపటికీ డాక్టర్ లేవలేదు. కొద్దిసేపటి తర్వాత నిద్రమత్తులో వచ్చి మీకేం కావాలని ఎందుకు ఇలా అరుస్తున్నారని ఏమైనా మెడిసిన్ కావాల్సి వస్తే తీసుకెళ్లండని సమాధానం చెప్పారు. దీంతో నర్సులు ఇంకేం డాక్టర్ ఉన్నాడు కదా..ఇంకేం సమాధానం చెప్పాలని..డాక్టర్ ముందే చిందులు వేశారు. విలేకర్లకే ఇలా సమాధానం ఇస్తే ఇక సామాన్య ప్రజలు వైద్యం కోసం వస్తే వీరి ప్రవర్తన ఎలా ఉంటుందో ఇట్టే అర్థమవుతుందని అక్కడున్న రోగులు బహిరంగంగానే చర్చించుకున్నారు. గత వారం క్రితం హాస్టల్‌లో చదివే విద్యార్థికి ఫిడ్స్ వస్తే ఆసుపత్రికి వస్తే ఆ అబ్బాయిని తీసుకురావద్దండని మరోసారి తీసుకొస్తే కేసులు పెడతామని నర్సులు ఆ అబ్బాయి వెంట వచ్చిన వారిని భయాందోళనకు గురిచేశారు. ఇలాంటి డాక్టర్లు, నర్సులపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

# రాబోయే ఎన్నికల్లో సచివాలయ కన్వినర్లు.. కీలకంగా పనిచేయాలి..!

**- చిత్తశుద్దిగా పనిచేసే కన్వినర్లకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుంది : మంత్రి గుమ్మనూరు జయరాం**

**ఆలూరు, ఆగస్టు 20,ప్రభాతవార్త**

రాబోయే ఎన్నికల్లో సచివాలయ కన్వినర్లు..కీలకంగా పనిచేయాలని..రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆదివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సచివాలయ కన్వినర్ల నమోదు కార్యక్రమంలో మంత్రి గుమ్మనూరు జయరాం ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయి నుండి పటిష్టంగా ఎన్నికలకు సిద్ధం అవ్వాలంటే సచివాలయ కన్వినర్లు కీలకంగా పనిచేయాలన్నారు. మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు అధికారంలోకి రావాలో మీకు అందరికి తెలుసునని దానిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు మీమ్మల్ని ప్రేరేపించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వైకాపా పార్టీలో కష్టపడి పనిచేస్తున్న సచివాలయ కన్వినర్లకు రూ.10లక్షల ప్రమాద జీవిత భీమాను అందిస్తుందన్నారు. భీమా ప్రాణంతో సమానం కాకపోయినా కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని మంత్రి తెలిపారు. ప్రతిపక్షాలు ఈర్ష్యతోనే ఆరోపణలు చేస్తున్నాయని ఘాటుగా విమర్శించారు. గతంలో ప్రజలకు అందని అభివృద్ధి, సంక్షేమ పరిపాలన గడప వద్దకు వచ్చిందన్నారు. పార్టీ భవిష్యత్తు కన్వినర్లు, గృహసారథుల చేతుల్లోనే ఉందని 175నియోజకవర్గాల్లో గెలుపు ఆలూరు నుంచే మొదలవ్వాలని మంత్రి పిలుపు నిచ్చారు. గ్రామాల్లో వాలంటరీలు సచివాలయాల ద్వారా ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో వివరించారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పర్యవేక్షించి అర్హులకు అందించే కీలకమైన భాద్యతలను కన్వినర్లకు అప్పగించిందన్నారు. ప్రతిఒక్కరు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని



జెసిఎస్ సైన్యం యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణస్వామి, ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఉప ఎన్నికల విజయంతో మిన్నంటిన సంబరాలు

**- సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల**

**ఆళ్లగడ్డ, ఆగస్టు 20, ప్రభాతవార్తః**

సర్పంచ్ ఉప ఎన్నికల్లో వైఎస్సార్సీపీ బలపరిచిన అభ్యర్థి విజయఢంకా మోగించడంతో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కార్యాలయంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ తాను మాటల మనిషిని కాదు చేతుల మనిషినని మరొక్కసారి ప్రజలకు నిరూపించానని ప్రతిపక్షాలు మాట్లాడుతున్న అవాస్తవాల్ని తానే కాదు ప్రజలు కూడ విన్నారని దానికి బదులు ఈ కోటకందుకూరు విజయమే సమాధానం అని ఆళ్లగడ్డ అభివృద్ధి కేవలం తమ కుటుంబంతోనే సాధ్యమని తాను ప్రజలకు మాత్రమే జవాబుదారినని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు మైక్ ముందర పెడితే పూనకం వచ్చినట్లు



మాట్లాడడం సరికాదని మీరెంటె ఏంటో ఓటుతో ప్రజలు మరొక్కసారి బుద్ధిచెప్పారని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో సర్పంచ్ కాదుకదా...ఒక్క వార్డు మెంబరు కూడ గెలిపించుకోలేని మీరు నా గురించి మాట్లాడడం మీ చేతకాని తనానికి నిదర్శనం. కోటకందుకూరు అభివృద్ధికి నేను ఇచ్చిన హామిలన్ని నేరవేర్చడానికి కేవలం రెండే రెండు నెలలు చాలని చెప్పడం కాదు చేసి చూపిస్తానని ఈ మీడియా సమావేశం సందర్భంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలియజేశారు.

# పగిడ్యాల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు పుల్యాల సత్యంరెడ్డికి కన్నీటివీడ్కోలు

**: పగిడ్యాల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు పుల్యాల సత్యంరెడ్డికి కన్నీటివీడ్కోలు**



**పగిడ్యాల, ఆగస్టు 20,ప్రభాతవార్త**

పగిడ్యాల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు, టిడిపి సీనియర్ నాయకులు పుల్యాల సత్యంరెడ్డి (60) శనివారం మృతిచెందారు. అధివారం నియోజకవర్గంలోని ప్రముఖ రాజకీయనాయకులు సత్యంరెడ్డి భౌతికాయం సందర్శించిన పాణ్యం మాజీ ఎంఎల్ఏ గౌరు చరిత, నంద్యాల మాజీ జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి, తెలుగు దేశంపార్టీ నాయకులు మాండ్ర లింగారెడ్డి, మాండ్ర ఉమాదేవి, పగిడ్యాల జెడ్పీటిసి పుల్యాల పుల్యాల దివ్య, మాజీ జెడ్పీటిసి పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాల శేషన్న, నందికొట్కూరు, గడివేముల మాజీ జెడ్పీటిసీలు గౌరు మురళీ. అనసూయమ్మ, సంకిరేణిపల్లె సర్పంచ్ యర్రం ప్రభాకరెడ్డి, చెరుకు అశోకరత్నం, పూల మాలువేసి ఘనంగా నివాళ్ళుఅర్పించారు. సత్యంరెడ్డి సోదరుడు పుల్యాల రాజశేఖరరెడ్డి కుటుంబసభ్యులను ఓదార్చారు. సత్యంరెడ్డి మృతికి సంతాపంతోపాటు కుటుంబసభ్యలకు తమ ప్రగాఢసానుభూతి తెలిపారు. చివరిసారిగా పుల్యాల సత్యంరెడ్డికి కన్నీటివీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మెన్‌లు గుండం రమణారెడ్డి, పెరుగు పురుషోత్తమరెడి , మీదివేయుల ప్రభాకరెడ్డి, నందికొట్కూరు మండలం టిడిపి కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, మాజీ ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, బ్రాహ్మణకొట్కూరు సింగిల్‌విండో మాజీ ప్రసిడెంట్ జయరామిరెడ్డి, రాష్ట్రప్రైవేట్ కళాశాలల యజమాన్యాల మాజీ అధ్యక్షుడు కట్టమంచి జనార్ధనరెడ్డి, కర్నూలు ఆర్‌సిరెడ్డి కళాశాలల అధినేత పుల్యాల రామచంద్రారెడ్డి, టిడిపి నాయకులు మహేష్ నాయడు, కాకరవాడ చిన్న వెంకటస్వామి, జయ సూర్య, ఓగిలి శ్రీనివాసులు, పగడం శేఖర్, సిరిగౌడు ,వైకాపా నాయకులు పల్లె సత్యనారాయణరెడ్డి, గంగాధరరెడ్డి, పుల్యాల వాసురెడ్డి, దామోధరరెడ్డి, శివానంద భారతీస్వామి. బందుమిత్రులు, గ్రామప్రజలు పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలోని వివిధమండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# జనంలో తెలుగుదేశం... మహిలాశక్తి విస్తృత ప్రచారం..!

**: నియోజకవర్గంలో మహిలల నుంచి ఆపూర్వ స్పందన**

**: టిడిపి అధికారంలోకి వస్తే మహిలలకు పెద్దపీఠ వేయడం చంద్రబాబుకే సాధ్యం**

**: శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డిని గెలిపించుకుందాం**



**ఆత్మకూరు ఆగష్టు20, ప్రభాతవార్త:**

ఎన్నికల సమీపిస్తున్న నేపధ్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆం ధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో మహిల శక్తి కార్యక్రమాలు మరోవైపు యువగలం పేరుతో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి వర్యులు నారా లోకేష్ చేపట్టిన కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు విశేష స్పందన మొదలైందని చెప్పవచ్చు. ఇందులో భాగంగానే నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గంలో టిడిపి రాబోయో ఎన్నికల్లో అధికారంలోకి వస్తే మహిలలకు పెద్ద పీఠ వేయడం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే సాధ్యమవుతుందని టిడిపి మహిల శక్తి నియోజకవర్గ కన్వీనర్ మహనంది గంగాదేవి నియోజకవర్గ స్థాయిలో ముమ్మరంగా విస్తృత స్థాయి ప్రచారంను ప్రారభించారు. ఈ కార్యక్రమానికి మహిలలు పెద్ద ఎత్తున్న హాజరుకావడంతో ఎటూ చూసిన విజయమే సాదిస్తున్నారు. రాజకీయాలకు చరిత్ర గాంచిన నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన టిడిపి యువనాయకులు రాజేంద్రనాద్‌రెడ్డి మంచి పట్టు ఉన్న నాయకుడుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇదే రీతిలో ఆత్మకూరు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలలో 50 సంవత్సరాల రాజకీయ చరిత్ర ఉన్న కుటుంబం మహనంది గంగాదేవి కుటుంబం అని చెప్పవచ్చు. ప్రస్తుతం ఈమె గ్రామ సర్పంచ్‌గా టిడిపి పార్టీలో కొనసాగుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలకు చురుకుగా మహనంది దంపతులు పాల్గొన్నడంతో కొంత మేర పార్టీ పగ్గాలు వీరి చేతికి అప్పగించడంతో భాద్యత కలిగిన మహిల శక్తి కార్యక్రమానికి మహిలలు పెద్ద ఎత్తున్న బ్రహ్మరథం పడుతున్నారని నియోజకవర్గంలో రాజకీయ విశ్లేషకులు, మేదావులు చర్చించుకోవడం విశేషంగా మారింది.

2024 ఎన్నికల్లో టిడిపి పార్టీ ఎంఎల్ఏగా బుడ్డా రాజశేఖరరెడ్డిని గెలిపించుకుందాం... ఎన్నికలు సమీపిస్తున్న నేపధ్యంలో నియోజకవర్గంలో అందరి నాయకులతో కలసి కట్టుగా సమన్వయంగా పనిచేసే విదంగా పార్టీ గెలుపుకోసం కష్టపడే నాయకులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఇదే వరకే మాజీ ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన ప్రణాలిక సిద్దంగా



ఉండాలనే లక్ష్య సాధనతో టిడిపి ప్రభుత్వం ముందుకు దూసుకెలు ంది. మరోవైపు మహిలలు చేస్తున్న మహిలశక్తి కార్యక్రమాలకు విశేష స్పందన రావడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు 2024 ఎన్నికల్లో టిడిపి పార్టీ ఎంఎల్ఏగా మాజీ ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డిని ఆశీర్వదించే విదంగా మహిలలే పెద్ద ఎత్తున్న కృషి చేయాలని సమావేశాలలో జోరుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో అతి త్వరలోనే రాజకీయ సమీకరణలు పార్టీలు మారే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నప్పటికి రోజులు గడిచే కొద్ది రాజకీయ నేతలో నాయకులో టిడిపి పార్టీని ఆదరిస్తున్న ప్రజా అభిమానం ఉన్న నాయకులు, కార్యకర్తలు, రాజకీయ విశ్లేషకులు మేదావులు టిడిపి పార్టీ తీర్థం పుచ్చుకునేందుక సన్నహాలు సిద్దం అవుతున్నట్లు నియోజకవర్గంలో కొసమెరుపుగా మారిందని చెప్పవచ్చు.

## నేడు వైయస్‌ఆర్ సెంటనరీ హాల్‌లో స్పందన కార్యక్రమం

**నంద్యాల, ఆగష్టు 20, ప్రభాతవార్తః** ప్రజల నంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం పట్టణంలోని వైయస్‌ఆర్ సెంటనరీ హాల్‌లో స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టరు డా.మనజీర్‌జిలాని సమూన్ ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులందరు హాజరు కావాలని కలెక్టరు తెలిపారు. అలాగే జిల్లా కే ంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్‌స్థాయిలో కూడ యధాతదంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. స్పందన కార్యక్రమంలో గత వారం నుంచి వినూత్న రీతిలో ప్రత్యేక చర్యలు చేపట్టామని ఇందకు అనుగుణంగా అధికారులు వ్యవహారించాలని ఆయన అదేశించారు.

## నేడు పోలీస్‌స్పందన కార్యక్రమం తాత్కాలిక రద్దు



**నంద్యాల క్రైం ఆగష్టు 20, ప్రభాతవార్తః** జిల్లా పోలీస్‌కార్యాలయంలో నేడు జరగనున్న పోలీస్ స్పందన కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్యకారణాల వల్ల తాత్కాలిక కార్యక్రమాన్ని రదు చేయడం జరిగిందని తెలిపారు. సుదీర్ఘప్రాంతాల నుండి వ్యయప్రయాసాలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి రావద్దని తెలిపారు. ఫిర్యాదుదారులు ఈవిషయాన్ని గమనించాలని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయం నందు పోలీస్‌స్పందన కార్యక్రమం జరగకపోయినా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల నందు సిఐ, డిఎస్పీ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రజలు గమనించి పోలీస్‌స్టేషన్ సరి ౖల్ కార్యాలయంలో ఫిర్యాదుదారులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వచ్చే సోమవారం యధావిధిగా జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

## అబివృద్ధి పనులు వేగవంతం చేయాలి ఈఓ లవన

**శ్రీశైలంప్రాజేక్టు, ఆగష్టు20, ప్రబాతవార్త**



శ్రీశైలక్షేత్రంలో జరుగుతున్న అబివృద్ధి పనులను వేగవంత పరచాలని శ్రీశైలందేవస్థానం ఆదికారులను ఆదివారంనాడు ఆదేశించారు. ఈక్రమంలోనే ఈఓ లవన్న క్షేత్రస్థాయిలో అబివృద్ధి పనుల యొక్క తీరుతేన్నులను ఇంజనీరింగు ఆదికారులతో కలసి పర్యవేక్షించారు. పంచమఠాల పునర్నిమాన పనులను, గణేష్ సదనం తదితర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లడుతూమఠాల చుట్టూ పచ్చదనాన్ని అబివృద్ధి పరచాలని, దేవత వృక్షాలను నాటాలని, గణేష్ సదనం వెనుక బాగాన అడవి జంతువులు రాకుండా కంచె ఏర్పాటు చేయాలని, అదే విధంగా గణేష్ సదనం వద్ద భద్రత సిబ్బంది ఏర్పాటు చేయాలని తదితర అంశాలపై అయా విబాగాల అదికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు రామకృష్ణ, మురళీధం "రెడ్డి, సిఎస్ఓ శివప్రసాద్, ఇన్‌చార్జ డిఈ చంద్రశేఖర్‌శాస్త్రి, సుబ్బారెడ్డి, ఉధ్యాన వన అదికారి లోకేష్, సహాయ ఇంజనీర్లు భవన్ తదితరులు పాల్గోనా న్నరు.

## ప్రపంచ దోమల దినోత్సవం

**- దోమలు పుట్టకూడదు...దోమలు కుట్టకూడదు**

**- ఫ్రై డే - డ్రై డే కార్యక్రమం**




**కర్నూలు అర్బన్, ఆగష్టు 20, ప్రభాతవార్తః** జిల్లా మలేరియా అధికారి నూకరాజు, జిల్లా వా ్యధి నిరోధక టీకాల అధికారి డా.ప్రవీణ్‌కుమార్‌తో కలిసి కర్నూలు రీజినల్ ట్రైనింగ్ సెంటర్ ఫిమేల్ నందు "సర్ రోనాల్డ్ రాస్" చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర ్భంగా డా.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దోమల వలన మలేరియా వ్యాధి ఒకరి నుండి మరోకరికి వస్తుందని సర్ రోనాల్డ్ రాస్ ఆగష్టు 20వ తేది 1897లో కనుగోన్నారని అందులకు వారికి 1902లో నోబుల్ ప్రైజ్ బహుకరించారని కొనియాడారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు మాట్లాడుతూ దోమలు పుట్టకూడదు, దోమలు కుట్టకూడదు అను నినదాన్ని అమలుచేయడం కొరకు ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. గృహపరిసరాల్లో నీటి నిల్వ లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఓ చంద్రశేఖర్, డిప్యూటి డెమో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైకాపాకు అండగా నియోజకవర్గాల ప్రజలు



**నందికొట్కూరు, ఆగష్టు 20, ప్రభాతవార్త:** నియోజకవర్గంలో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలిపారని వైకాపా నాయకులు తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి అర్హునికి అంధించిన ఘనత వైకాపాకు దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో జరిగిన 11 వార్డులలో వైకాపా 8 స్తానాలు దక్కించుకుందన్నారు. కొన్ని చోట్ల టిడిపి పోటీ చేయలేక పోయిందన్నారు. త ్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైకాపాకు పట్టం కట్టేందుకు ఓటర్లు సిద్దంగా ఉన్నారని వారు తెలిపారు. ఈ సమావేశంలో వైకాపా పట్టణ అధ్యక్షుడు మన్సూర్, తర్తూరు సర్పంచ్ నాగిరెడ్డి, జేసిఎస్ కన్వీనర్ ఓంకార్‌రెడ్డి, పగిడ్యాల సర్పంచ్ బాస్కర్, పైపాలెం వైస్ సర్పంచ్ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు

## మెడికల్ కళాశాలలో 38 సీనియర్ రెసిడెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు

**కర్నూలు అర్బన్, ఆగష్టు 20, ప్రభాతవార్తః**

కర్నూలు వైద్య కళాశాల యందు ఖాళీగా ఉన్న 38 సినియర్ రెసిడెంట్ పోస్టులను భర్తీచేయడానికి డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విజయవాడ వారి ఉత్తర్వుల మేరకు ప్రకటన విడుదల చేయడం జరిగింది. 21-08-2023 ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు కర్నూలు మెడికల్ కళాశాల కౌన్సిల్ హాల్ నందు వాకిన్ రిక్రూట్‌మెంట్ జరుగుతుంది. ఈ వాకిన్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఒక సంవత్సరానికి నియమించడం జరుగుతుంది. అలాగే కర్నూలు వైద్యకళాశాలలో పిజి చదివిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఇతర జిల్లాల నుంచి వచ్చేవారికి రెండవ ప్రాధాన్యత ఇవ్వబడుతుందని మెడికల్ కళాశాల అఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ కర్నూలు మెడికల్ కళాశాల కర్నూలు. ఒక ప్రకటనలో తెలిపారు. .